

# నీళ్ళు

నీళ్ళు! నీళ్ళు! నీళ్ళకోసం పేటపేటంతా గగ్గోలెత్తిపోతూంది. అప్పుడే రెండు రోజులుగా మంచినీళ్ళ టాంకర్ కోసం చూసిచూసి ప్రాణం కడగట్టిపోతూంది. ఏ హారన్ వినిపించినా టాంకర్ వస్తూందని ఆశగా చూసి, కాదని నిర్ధారణ కాగానే నిరాశతో తమ దురదృష్టాన్ని తిట్టుకుంటున్నారు.

గౌరి మాటిమాటికి నాలుకతో పెదాన్ని తడుపుకుంటుంది. ఎండి పగిలిన పెదాలు తడి తగలగానే మండుతున్నాయి. రెండు రోజులుగా స్నానం లేక ఒళ్ళంతా చీదరగా వుంది. ఎప్పుడో మధ్యాహ్నం తిన్న నాలుగు మెతుకులు, ఆకలితో నకనకలాడిపోతూంది కడుపు. అత్త, భర్త తినకుండా తను తింటే అత్త వడ్డించే తిట్లు, శాపనార్థాలను తలచుకొని కొంచెం మంచినీళ్ళన్నా తాగుదామని కుండమీద మూతతీసింది. ఒక్క బొట్టుకూడా లేకుండా కడిగిపెట్టినట్లుగా వున్న కుండను చూడగానే గౌరి ప్రాణం ఉసూరుమంది. గొంతుకార్చుకుపోతుంటే ఓర్చుకోలేక ఎదురింటి నరసమ్మను కాసిన్నీళ్ళు బదులడిగింది.

'పిల్లా జెల్లా లేన్దానివి నీ యింట్లోనే లేకపోతే మా యిళ్ళల్లో ఎక్కడుంటాయే నీళ్ళు గౌరీ! తెల్లారి లేచిందగ్గర్నుంచి బంగారంలా దాచుకున్నా ఎట్లాగోట్లా పట్టుకుపోయి పారబోస్తారు పిల్లసన్నాసులు.'' నరసమ్మ యింకా తన ఆశక్తతను ఏకరువు పెడుతూ వుండగానే కాళ్ళీడ్చుకుంటూ యింటికి చేరింది గౌరి.

"ఎక్కడికెళ్ళావే పెత్తనాలకు? నీళ్ళ బండొస్తుందని అంతా బిందిల్తీసుకుని లగెత్తు తూంటే నువ్వక్కడ సొల్లుకబుర్లు చెప్తూ కూర్చున్నావా?'' అప్పటిదాకా ఊరిమీద పడి తిరిగొచ్చిన గౌరి అత్త నాంచారమ్మ కోడలివంక గుడ్లురిమి చూసింది. నీరసంతో కాళ్ళు తేలిపోతున్నా నీళ్ళబండొస్తోందనే సరికి కొండంత సంబరంతో బిందె తీసుకుని వెళ్ళింది గౌరి. అప్పటికే కొండవీటి చాంతాడంత వుంది 'క్యూ'. బలవంతులు వెనకొచ్చినా 'క్యూ'లో ముందర జొరబడుతున్నారు. కొట్లాటలు, కుమ్ములాటలు, కక్కుర్తి... రోజూ చూస్తున్న భాగోతమే అయినా యీరోజు అసహనంగా గమనిస్తాంది గౌరి.

"ఏం బతుకులో! గుక్కెడు మంచి నీళ్ళక్కూడా నోచుకోని దరిద్రపు బ్రతుకులు. ఏ మళ్ళా మాన్యాలూ, సిరులూ, సంపదలూ, భోగభాగ్యాలూ లేకపోతే మానె. గొంతు తడుపుకుంటానికి నీళ్ళన్నా లేకపోతే ఎట్లా ఈడ్చేదీ పాడుబ్రతుకు?...'' దుఃఖంతో గౌరి గొంతు గురగురలాడింది.

"ఏదో బావుకు తిందామని నాలుగు కుంచాల చేను కౌలుకు తీసుకున్నాం. అప్పుచేసి నాట్లేస్తే నీళ్ళచుక్కలేక నేల నెర్రిచ్చి పంట మలమల మాడిపోయింది. గొడ్లూ గోదా డొక్కలెండిపోయి నోళ్ళు తెరచుకుని చొంగలు కారుస్తున్నాయి. కడుపున పుట్టిన పిల్లల్ని సాకినట్లు సాకిన గొడ్లను ఆటి కర్మానికాటి నొదిలేసి పొట్టపట్టుకు నిక్కడికి వచ్చాం. రిక్షాతొక్కి రెండు డబ్బులు తెస్తే పిల్లాళ్ళకు గంజికాచి పొయ్యడం గగనమవుతాంది. ఎప్పటికా వానదేవుడికి దయకలుగుతుందో, ఎప్పటికి మా కష్టాలు గట్టెక్కుతాయో!' హృదయ విదారకంగా విలపిస్తూ చెప్తాందో ఇల్లాలు.

"మనకు తిండిలేకపోయినా, గొంతుకలెండిపోయి ఛస్తున్నా యెవడికి పడుతుందండీ? పట్టించుకోవలసిన దొంగరాస్కెల్స్ అందరికీ ఎవడి పదవి వాడికి, ఎవడి సింహాసనం వాడికి చల్లగా వుంటే చాలు. ఎందరు ప్రభువులు మారినా మన అధ్వాన్నపు బ్రతుకులు మాత్రం మారవు.'' కడుపు మండిన ఒకతను ఆవేశంగా అంటున్నాడు.

"కొంచెం ఖాళీ అయింది. నడవ్వే గౌరీ ముందుకు.'' చంకలోంచి జారిపోతున్న బిడ్డను పైకి తీసుకుంటూ గౌరిని అదిలించింది కాంతం. కాంతం చేతిలో బిడ్డను చూడగానే గౌరి హృదయంమీద వర్షపు చుక్క జారిపడినట్లుగా చిన్ని గిలిగింత కలిగింది. ఈ రోజు సెంటర్‌లో డాక్టరమ్మ తన చెవుల్లో అమృతం పోసింది. ఇన్నేళ్ళకు తన కడుపు పండి కష్టాలు

తీరబోతున్నాయి. ఇన్నాళ్ళూ పిల్లలు పుట్టలేదని అత్తరాచి రంపాన పెడతాంది. ఈ గొడ్డుమోతుదాన్ని వదిలేసి నాకొడుక్కు మళ్ళీ పెళ్ళిచేస్తానని బెదిరిస్తోంది. అత్త అట్లా అన్నప్పుడల్లా తను భయంతో వజవజ వణికిపోతోంది. తనకు ఓ చిన్నారి పాపాయి పుట్టాకగాని అమ్మ మాటకు వంతపాడే ఆయనగారెదుట తలెత్తి నిలబడేందుకు శక్తి రాదు. ఆప్యాయంగా పొట్టమీద చేత్తో తడుముకుంది గౌరి.

"తను బిడ్డ నెత్తుకున్నాక నీళ్ళు పుష్కలంగా దొరికే చోటికి పోదామని ఆయన్తో చెప్పాలి. కరువుదీరా స్నానం చేసి, కడుపు నిండా నీళ్ళు తాగగలిగేచోట యింక ఏ సుఖాన్నీ కోరుకుకుండానైనా బ్రతుకుదామని చెప్పాలి"- గౌరి ఆలోచనల్లో వుండగానే నీళ్ళ టాంకర్ వచ్చింది. ఒక్కసారిగా 'క్యూ' చెల్లాచెదరయి, బలాబలాలు చూసుకుంటూ తోసుకుని ముందుకు వెళ్ళి నీళ్ళు పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. తోపులాటలు, జుట్టుపట్లు, బిందెలతో యుద్ధం. క్షణంలో భీభత్సంగా మారిపోయింది. ఇటు బయటకు రాలేక, అటు నీళ్ళు పట్టుకోలేక తాపులు, తోపుళ్ళు భరిస్తూ భయంతో, కంగారుతో తబ్బిబ్బు పడిపోతూంది గౌరి: ఇంతలో ఆ తోపుళ్ళాటలో అకస్మాత్తుగా ఎవరో వచ్చి గౌరిమీద పడడంతో ముందుకు తూలిపడింది. చేతిలోని బిందె క్రిందపడి దానిమీద గౌరిపొట్ట బలంగా నొక్కుకు పోయింది.

రక్తంతో తడిసిన గౌరిని స్పృహలేసి స్థితిలో హాస్పిటల్‌కు చేర్చారు. గర్భస్రావమయి పోతూంటే పిండాన్ని తీసేసి రక్తం ఎక్కించాక గౌరికి తెలివొచ్చింది.

"నాకేమయింది డక్టారమ్మగారూ? నా బిడ్డకేం కాలేదుగదా?" హీన స్వరంతో ఆతృతగా అడిగింది గౌరి.

"ఏమీ అవలేదు. అంతా బాగానే వుంది. నువ్వు విశ్రాంతిగా పడుకోవాలమ్మా!" గౌరి చూపుల్ని తప్పించుకుంటూ జవాబిచ్చింది డాక్టర్ శ్రుతి.

"నిజంగానా అమ్మగారూ!" అపనమ్మకంగా పొట్టను తడుముకుంది గౌరి. తనబ్రతుకు, భవిష్యత్తు తన బిడ్డమీద ఆధారపడి వున్నాయి. దానికేమన్నా అయితే తన బ్రతుకు కడగండ్ల పాలవుతుందన్న నిజం ఆమెను భయవిహ్వలురాల్ని చేస్తూంది.

కూతుర్ని చూచి గొల్లుమన్న తల్లి ఏడుపు విని తృళ్ళిపడ్డ గౌరికి డాక్టరమ్మ తనకు సరైన సమాధానం చెప్పకుండా ఎందుకు తప్పించుకు వెళ్ళిపోయిందో అర్థమయింది. గౌరి కడుపులో నుంచి దుఃఖం కడలి పొంగులా ఉవ్వెత్తున కదిలి వస్తూంది. కన్నీళ్ళకు కరువు లేకుండా జలజల రాలి ఆమె గుండెల్ని తడుపుతున్నాయి.